క్లుప్తంగా

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ

జగిత్యాల: అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. అంబేడ్కర్ 134 జయంతి ఉత్సవాలు కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగాన్ని 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు సుదీర్ఘంగా అనేక దేశాలు పర్యటించి దేశానికి అవసరమైన అంశాలను దాదాపు వెయ్యేళ్లకు సరిపడా దూరదృష్టితో రాజ్యాంగాన్ని రచించిన మేధావి అన్నారు. ప్రతి ఒక్కరూ దేశానికి సేవ చేయాలన్నారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ పడాల తిరుపతి, చంద్రయ్య, శ్రీనివాస్‌రెడ్డి, జమున పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోళ్లు ప్రారంభిస్తున్న జిల్లా సహకార అధికారి సత్యనారాయణ

రాయికల్: ధాన్యం కొనుగోళ్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార అధికారి సత్యనారాయణ అన్నారు. అల్లీపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. రైతులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా తప్పా, తాలు లేకుండా కేంద్రానికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సీఈవో ఉపేందర్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

కోరుట్ల: పట్టణంలోని గౌతమ్ హైస్కూల్ విద్యార్థులు గైడియల్ ఒలంపియాడ్, ఐఐటీలో ప్రతిభ చాటి అవార్డులు సాధించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మ్యాథ్స్, ఇంగ్లిష్, సైన్స్ గైడియల్ ఒలంపియాడ్‌లో జాతీయ స్థాయిలో జోబియా సబీన్, షేక్ ఫైజన్ 6, 16 ర్యాంకులు, రాష్ట్ర స్థాయిలో అరీబా హనూస్, షిజా అనమ్, నక్క రుషేంద్ర 4,12,18 వ ర్యాంకులు,జిల్లా స్థాయి టాపర్లుగా ఆయేషా ఫిరదోస్, జోబియా సబీన్, జువేరియా బతూల్ నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను సోమవారం పాఠశాల యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎంఎ గఫార్, ప్రెసిడెంట్ ఎంఏ.కిజర్, ప్రిన్సిపాల్ గోపి మారని, పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

పెగడపల్లి: మండలంలోని మద్దులపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. చిన్నారుల తల్లుల సమక్షంలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడంతో చిన్నారుల తల్లులు వారి ప్రతిభను చూసి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ విద్యతో పాటు ఆటపాటలు నేర్పించి వారిని అప్‌గ్రేడ్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శోభ, శైలజ, రజిత, హెల్పర్లు పాల్గొన్నారు.

చట్టాలు ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

బుగ్గారం: చట్టాల ఉల్లంఘనకు పాల్పడుతూ, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం బేఖాతర్ చేస్తున్న జిల్లా పంచాయతీ సమాచార అధికారి, అప్పిలేట్ అధికారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు,ఆర్టీఐ కార్యకర్త చుక్క గంగారెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో తాను సమాచార హక్కు చట్టం కింద పలు దరఖాస్తులు చేయగా, అధికారులు సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం చూపారని ఆరోపించారు. ఈ విషయంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీమతి బీ.ఎస్ లత అధికారులను మందలించి, వెంటనే సమాచారం అందించాలని ఆదేశించినా అధికారులు స్పందిచడం లేదన్నారు. నేటికి ఆరు నెలలు గడుస్తున్నా తాను కోరిన సమాచారం ఇవ్వడం లేదని ఆరోపిస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తనకు సమాచారం ఇవ్వని అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.



హోమం చేస్తున్న అర్చకులు

విగ్రహ ప్రతిష్ఠ

ధర్మపురి: మండలంలోని దమ్మన్నపేట శ్రీవీరభద్రేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శ్రీసీతారామచంద్ర స్వామి శిలా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేదపండితులు దిలీప్‌శర్మ, ఆలయ అర్చకులు గుండి నర్సయ్య ఆధ్వర్యంలో ప్రధాన సంకల్పము, గణపతి పూజ, స్వస్తి పుణ్యాఃవచనం, నవగ్రహ, అగ్నిప్రతిష్ఠ, హోమాలు తదితర పూజలు చేశారు. గ్రామస్తులు, హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.



శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

శివపార్వతుల కల్యాణం

కథలాపూర్: మండలంలోని సిరికొండ శ్రీ మహదేవస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం వేళ శివుడికి అభిషేకం చేసి పూజలు చేశారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేసి వేదిక వద్దకు తీసుకువచ్చారు. అర్చకులు సాంప్రదాయబద్ధంగా శివపార్వతుల కల్యాణం జరిపించారు. ఉత్సవాల అనంతరం భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



అఖండ సాయినామ సంకీర్తనలో బాబా భక్తులు

5వ రోజుకు సాయినామ సంకీర్తన

జగిత్యాలటౌన్: శ్రీరామ నవమి పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో అఖండ సాయినామ సంకీర్తన ఐదో రోజు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన 1008 (వెయ్యి ఎనిమిది) కలశాలను గంగాజలంతో నింపి పూజలు చేశారు. సాయినామ సప్తాహంలో భాగంగా భక్తులను 8 బ్యాచులుగా విభజించి ప్రతి బ్యాచ్‌కు మూడు గంటలుగా నిర్ణయించారు. ఈ అఖండ సాయినామ సప్తాహం రాత్రి పగలు నిర్విరామంగా సాగుతుందన్నారు. ఆలయంలో ఏర్పాటు చేసిన కలశాలకు ప్రతి నిత్యం పూజలు, హారతి ప్రత్యేకత అని ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వేదపండితులు బ్రహ్మశ్రీ తిగుళ్ల విషుశర్మ, ఆలయ కమిటీ సభ్యులు, సత్సంగాల సభ్యులు పాల్గొన్నారు.

నిధులు మంజూరైనా.. పనుల జాడేది?

- హై లెవల్ వంతెనలకు మోక్షమెప్పుడో ?
- 10 నెలలైనా ప్రారంభించని పనులు
- టెండర్లు పూర్తి... పనులకు 9 నెలలే సమయం



వర్షకొండ లో లెవల్ వంతెనపై ప్రవహిస్తున్న నీరు (ఫైల్)



ఇబ్రహీంపట్నం నుంచి వర్షకొండ వెళ్లే దారిలో లో లెవల్ వంతెన

ఇబ్రహీంపట్నం: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లలో హై లెవల్ వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కానీ అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదు. గ్రామాల్లోని రోడ్లపై లో లెవల్ వంతెనలు ఉండడంతో వాహనదారులు, రైతులు వర్షాకాలంలో అనేక ఇబ్బందులు పడుతున్నారు. మెట్‌పల్లి నుంచి మూలరాంపూర్, గోదూర్ నుంచి బట్టాపూర్, రోడ్లు డబుల్ రోడ్డుగా మార్చినా.. లో లెవల్ వంతెనల స్థానంలో హైలెవల్ వంతెనలకు నిధులు మంజూరు కాలేదు. మండలంలో 5 లో లెవల్ వంతెనలు ఉండగా, ప్రతీ వర్షాకాలంలో రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోతున్నాయి. మెట్‌పల్లి నుంచి మూలరాంపూర్ దారిలో తిమ్మాపూర్ వద్ద ఒకటి, యామాపూర్ -ఫకీర్ కొండాపూర్ వెళ్లే దారిలో ఒకటి, ఇబ్రహీంపట్నం నుంచి బట్టాపూర్‌కు వెళ్లే దారిలో రెండు, కొమటి కొండాపూర్ నుండి ఎర్దండికి వెళ్లే దారిలో ఒకటి లో లెవల్ వంతెనలు ఉన్నాయి. మండలంలోని వర్షకొండలో గ్రామం చుట్టూ లో లెవల్ వంతెనలు ఉండడంతో వర్షాకాలం రాకపోకలు నిలిచిపోయి గ్రామస్థులు ఎటు వెళ్లలేని పరిస్థితి ఉంటోంది. దీంతో హై లెవల్ వంతెనలను నిర్మించాలని మండలంలోని ప్రజాప్రతినిధులు, ప్రజలు, అప్పటి ఎమ్మెల్యే విద్యాసాగర్ రావుకు నిధులు మంజూరు చేయాలని పలుసార్లు విన్నవించారు.

రూ.13 కోట్ల నిధులు మంజూరు

మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లలో హై లెవల్ వంతెనల నిర్మాణానికి రూ.13 కోట్లు నిధులను అప్పటి ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు మంజూరు చేయించారు. పనులను చేసేందుకు ఆర్అండ్‌బీ శాఖ వారు టెండర్లు పిలిచారు. జూన్ 30, 2023న అప్పటి ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు శంకుస్థాపనలు చేశారు. వంతెనల పనులు చేపట్టేందుకు ఆర్అండ్‌బీ శాఖ వారు టెండర్లు పిలిచారు. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులను తొమ్మిది నెలల్లో పూర్తి చేయాల్సి ఉంది. కానీ 10 నెలలు అవుతున్నా.. ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదు. 5 హైలెవల్ వంతెనలకు యామాపూర్ టు ఫకీర్ కొండాపూర్, కొమటికొండాపూర్, ఎర్దండి వెళ్లే దారిలో హై లెవల్ వంతెనలను కాంట్రాక్టర్లు పనులను ప్రారంభించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వర్షాకాలానికి ముందే వంతెనల నిర్మాణం పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వర్షాకాలంలో ఇబ్బందులు



ఇబ్రహీంపట్నం నుంచి వర్షకొండ వెళ్ల దారిలో ఉన్న లో లెవల్ వంతెనలతో ప్రతీ వర్షాకాలం వంతెనలపై నుండి భారీగా నీరు ప్రవహించి రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో వ్యవసాయ భూములకు ,పంట పొలాలకు రోజుల తరబడి వెళ్లలేకపోతున్నాం.

– నల్ల రమేశ్, రైతు ఇబ్రహీంపట్నం

చర్యలు తీసుకోవాలి



ఇబ్రహీంపట్నం-వర్షకొండ రోడ్డులో రెండు లో లెవల్ వంతెనలు ఉన్నాయి. ప్రతీ వర్షాకాలం రాకపోకలు నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నాం.వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరైనా ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు. కాంట్రాక్టర్లపై అర్అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాలి. – పోనకంటి వెంకట్, ఎంపీటీసీ, వర్షకొండ

త్వరలో ప్రారంభిస్తాం



హైలెవల్ వంతెనల టెండర్లు దక్కించుకున్న సంబంధిత కాంట్రాక్టర్లతో వెంటనే పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. ఒకవేళ పనులను ప్రారంభించకపోతే కాంట్రాక్టర్లకు నోటీసులు అందజేస్తాం. త్వరలో పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేయించేందుకు కృషి చేస్తాం.

– వేణు, ఆర్అండ్‌బీ ఏఈ, మెట్‌పల్లి

ఆరు గ్యారంటీలతో పేదల అభివృద్ధికి కృషి



కరంను సన్మానిస్తున్న గౌడ సంఘం సభ్యులు

మల్లాపూర్: ప్రజా ప్రభుత్వంలో ఆరు గ్యారంటీలను అమలు చేసి సీఎం రేవంత్‌రెడ్డి పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, సుప్రీం కోర్టు అడ్వకేట్ కొమిరెడ్డి కరం, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి అన్నారు. మండలంలోని కొత్తదాంరాజుపల్లిలో మల్లాపూర్ శ్రీ రేణుకాఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం 90 శాతానికి పైగా అమలు చేసిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బీసీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని హన్మాండ్లు, మాజీ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గజ్జి గంగారెడ్డి, నాయకులు మరిపెల్లి మల్లయ్య, కోటగిరి ఆనంద్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



కొనుగోలు కేంద్రంలో ధాన్యం పరిశీలిస్తున్న ఏవో

ఇబ్రహీంపట్నం: రైతులు నాణ్యతా ప్రమాణాలను పాటించి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకవచ్చి సహకరించాలని మండల వ్యవసాయ అధికారి దీపిక కోరారు. సోమవారం మండలంలోని అమ్మక్కపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. వరి ధాన్యంలో తేమశాతాన్ని పరిశీలించారు. 17 శాతంలోపు తేమశాతం ఉన్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని, తాలు, తప్ప ఉండకూడదని, ధాన్యాన్ని మిషన్లలో తూర్పార పట్టించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో నరేశ్, రైతులు పాల్గొన్నారు.

వరికోతలో మెలకువలు పాటిస్తే నాణ్యమైన ధాన్యం

మల్లాపూర్: వరి కోత సమయంలో మెలకువలు పాటిస్తేనే నాణ్యమైన ధాన్యం పొందవచ్చని వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈవో) సాయిప్రియ అన్నారు. మండలంలోని చిట్టాపూర్‌లో కోతకు వచ్చిన వరిపంటలను సోమవారం రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరిని సాగు చేయడం ఒక ఎత్తయితే కోతల సమయంలో పంటను కాపాడుకోవడం మరో ఎత్తని, వరిపైరు తూరిపోకుండా సరైన సమయంలో కోతలు చేపడితే అధిక దిగుబడి వస్తుందన్నారు. వరి కోత సమయంలో హార్వెస్టర్ ఆర్పీఎం 18 నుంచి 19 ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు కొత్తపల్లి రవితేజ, గడ్డం రాజ్‌కుమార్, శేఖర్, జలంధర్ పాల్గొన్నారు.


వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

మెట్‌పల్లి: వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్ సూచించారు. వడదెబ్బకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలతో కూడిన కరపత్రాలను పట్టణంలోని పలు వార్డుల్లో శనివారం ఇంటింటికీ మున్సిపల్ సిబ్బంది పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వడ దెబ్బ తగిలితే తీసుకునే జాగ్రత్తలు గురించి పట్టణ ప్రజలకు వివరిస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ దొంగలించిన ముగ్గురు అరెస్ట్

మల్యాల: మండలంలోని రాజారం గ్రామంలో ట్రాక్టర్ దొంగలించిన ముగ్గురిని అరెస్టు చేసి, మరో మైనర్ బాలుడిని జువైనల్ హోంకు తరలించినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. నిర్మల్ జిల్లా కడెం మండలం అల్లంపెల్లికి చెందిన సింగిరెడ్డి చంద్రోఖర్‌రెడ్డి, ఊట్నూరు మండలం షానగర్‌కు చెందిన గౌరై మధుకర్ సొంత బావబామ్మర్దులతోపాటు కడెం మండలం అల్లంపల్లికి చెందిన పెంబి రాజు ఎక్కువ ఆదాయం సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో జగిత్యాల ప్రాంతంలో దొంగతనం చేయాలని ద్విచక్ర వాహనంపై ఇక్కడికి రాగా, మైనర్ బాలుడు బస్సులో వచ్చాడు. అందరూ కలిసి రెక్కి నిర్వహిస్తుండగా, మల్యాల మండలం రాజారం గ్రామంలో ఓ ఇంటి వద్ద రెండు ట్రాక్టర్లు నిలిపి ఉంచగా, ఒకదానిని దొంగలించి కొండగట్టు సమీపంలోని గుట్టల చాటుకు తీసుకెళ్లి రంగు వేశారు. సోమవారం ట్రాక్టర్‌ను తమ గ్రామానికి తీసుకెళ్తుండగా, కొండగట్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించి పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి ట్రాక్టర్, ద్విచక్ర వాహనం, మూడు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. గతంలో సింగిరెడ్డి చంద్రోఖర్‌రెడ్డి, పెంబి రాజు ట్రాక్టర్ దొంగతనం చేయగా గుడిహత్నూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కేసును ఛేదించిన పోలీసులను డీఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో సీఐ రవి, ఎస్సై అబ్దుల్‌రహీం, కుమారస్వామి తదితరులు ఉన్నారు.

ఈజీఎస్‌లో చేపట్టిన ప్రతీ పనిని తనిఖీ చేయాలి



సమావేశంలో అధికారులు, సిబ్బంది

పెగడపల్లి: మండలంలో చేపట్టిన ప్రతీ పనిని తనిఖీ చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి సామాజిక తనిఖీ బృందానికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఈజీఎస్ సామాజిక తనిఖీ బృందం సభ్యులు, పంచాయతీరాజ్, ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ సభలు నిర్వహించి జరిగిన పనులు, పాల్గొన్న కూలీలు, చెల్లించిన వేతనాల వివరాలను వెల్లడించి పనులను తనిఖీ చేయాలన్నారు. దీనికి పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది సహకరించాలన్నారు. ఎంపీవో మహేందర్, ఎస్ఆర్పీ సురేందర్‌బాబు, ఏపీవో అనిల్, టీఏ రమాపతి, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు పాల్గొన్నారు.

వీర హనుమాన్ విజయయాత్ర కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

మల్లాపూర్: హైందవ ఐక్యతను చాటేలా ప్రతి ఒక్కరూ 'వీర హనుమాన్ విజయయాత్ర' లో పాల్గొనాలని విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు కైర నాగేశ్ అన్నారు. మల్లాపూర్‌లోని సోమేశ్వర కొండ, హనుమాన్ ఆలయం వద్ద సోమవారం వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో 'వీర హనుమాన్ విజయయాత్ర' కరపత్రాలను అంజన్న స్వాములతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 21న దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న 'వీర హనుమాన్ విజయయాత్ర'లో హిందువులందరూ పాల్గొనాలన్నారు. మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయం నుంచి సాయంత్రం 4 గంటలకు నిర్వహించే యాత్ర ప్రారంభవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆకుతోట రాజేశ్, దేవాదాయ కమిటీ చైర్మన్ సంగ గంగరాజం, వీహెచ్‌పీ మండల ఉపాధ్యక్షుడు చిలివేరి నవీన్, పట్టణ అధ్యక్షుడు వెంపేట లక్ష్మారెడ్డి, భజరంగ్‌దళ్ మండల కన్వీనర్ బండి జైపాల్, పట్టణ కో-కన్వీనర్ గాండ్ల మణికంఠ, కార్యకర్తలు, అంజన్న స్వాములు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన గీత కార్మికులు



పార్టీలో చేరుతున్న గీత కార్మికులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 50 మంది గీత కార్మికులు, సర్దార్ సర్వాయి పాపన్న మండల అధ్యక్షుడు నేరేళ్ల సుభాష్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం మెట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. గీత కార్మికులకు ఆయన పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బూస రాజేశ్వర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దుదిగాం గంగాధర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, మెట్‌పల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, గీత కార్మికులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా సమ్మయ్య

కోరుట్ల: పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు చెరకు సమ్మయ్యను జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ సోమవారం ఎస్సీ సెల్ అధ్యక్షుడు దరూరి రమేశ్ బాబు లేఖ జారీ చేశారు. ఈ సందర్భంగా చెరకు సమ్మయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన బాధ్యతలను నెరవేర్చడానికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి జ్యోతిదేవి, నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, ఓబీసీ సెల్ నాయకులు విజయ్‌ఆజాద్‌కు ధన్యవాదాలు తెలిపారు.

గ్రామాల్లో బీజేపీ నాయకుల ప్రచారం



తాండ్ర్యాలలో ప్రచారం చేస్తున్న నాయకులు

కథలాపూర్: మండలంలోని దూలూర్, భూషణరావుపేట, తక్కళ్లపెల్లి, తాండ్ర్యాల గ్రామాల్లో బీజేపీ నాయకులు సోమవారం ఇంటింటా ప్రచారం చేశారు. కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌కు ప్రజలు మద్దతు ఇవ్వాలని కరపత్రాలు పంపిణీ చేశారు. అవినీతిలేని పాలన బీజేపీతోనే సాధ్యమని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేశ్వర్‌రావు, మామిడిపెల్లి ప్రవీణ్, దయ్య లక్ష్మినర్సయ్య, గజబీంకార్ ప్రవీణ్, గంగుల శ్రీనివాస్, జిల్లా సత్యం, రాజాగౌడ్, ఇస్తార్ పాల్గొన్నారు.

కార్పెంటర్ కుటుంబానికి ఆర్థికసాయం

మెట్‌పల్లి: కార్పెంటర్‌గా పని చేసే పట్టణానికి చెందిన శ్రీరామ్ రాజు కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అతనిది పేద కుటుంబం కావడంతో విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం, హిందూ సేన ఆధ్వర్యంలో సోమవారం కుటుంబ సభ్యులకు రూ.40వేల ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు పులిమామిడి చంద్రయ్య, కొడిమ్యాల వెంకటస్వామి, అంజయ్య, హన్మాండ్లు, తిప్పారపు లక్ష్మణ్ తదితరులున్నారు.

రైతులకు నేడు శిక్షణ

సారంగాపూర్: సేంద్రియ కార్బనం, వరి నాణ్యత ప్రమాణాలపై మంగళవారం సారంగాపూర్ రైతువేదికలో వ్యవసాయ శాస్త్రవేత్తలతో శిక్షణా కార్యక్రమం ఉంటుందని ఏవో తిరుపతి నాయక్ తెలిపారు. రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా ఉదయం 10 గంటల నుండి 11.30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదర్శ రైతులతో మాట్లాడే అవకాశం రైతులకు ఉంటుందని, రైతులు పాల్గొనాలని సూచించారు. ఆయన వెంట ఏఈవో వెంకటేష్, అంజనేయులు ఉన్నారు.

పోలింగ్ బూత్ అధ్యక్షులను తొలగించటం సరికాదు

కోరుట్ల: పట్టణంలోని బీజేపీ పోలింగ్ బూత్ అధ్యక్షులను తొలగించటం సరికాదని బూత్ అధ్యక్షులు అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, క్రమ శిక్షణతో పనిచేస్తున్న తమను ఎందుకు తొలగించారో పట్టణ అధ్యక్షుడు, నియోజకవర్గ కన్వీనర్లు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీలో కొత్తగా చేరిన వారిని నియమించటం సరికాదని, ఇష్టారాజ్యంగా పార్టీని నడిపిస్తే ఊరుకునేది లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆడెపు నవీన్, వడ్లకొండ శ్రీనివాస్, గిన్నెల అశోక్, పాతర్ల నర్సయ్య, కట్కూరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గౌడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం

కోరుట్ల: పట్టణంలోని కౌండిన్య గౌడ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం సోమవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా తోడేటి విజయ్ కుమార్ గౌడ్, కోశాధికారిగా పోతుగంటి వెంకటేశం గౌడ్, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కార్యవర్గాన్ని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, కౌన్సిలర్ గంగాధర్ గౌడ్ అభినందించారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

జగిత్యాల: జిల్లా గౌడ సంఘం ఆధ్వర్యంలో అనాథ వృద్ధులకు పండ్ల పంపిణీ, అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధులకు ప్రతి ఒక్కరు సేవ చేయాలన్నారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా గోప అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, కార్యదర్శి రాజయ్యగౌడ్, సత్యనారాయణ, శ్రీనివాస్, సత్తయ్య, గొల్లపల్లి రాజు పాల్గొన్నారు.